నేటి నుంచి మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం

ఉత్సవాలకు ముస్తాబైన యాదగిరి గుట్ట ఆలయం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి18 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య విమాన స్వర్ణ గోపుర మహా కుంభాభిషేక ప్రతిష్ఠామహోత్సవానికి బుధవారం ప్రధానార్చకులు, రుత్విక్కులు, వేద పండితులు స్వస్తివాచనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహ వాచనం, రక్షాబంధనం కార్యక్రమాలతో శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను దేవస్థాన అధికారులు పూర్తి చేశారు. కొండపైన ఉత్తర మాఢవీధుల్లో పంచకుండాత్మక హోమం నిర్వహించేందుకు ఐదు కుండాలను ఏర్పాటు చేశారు. ఇందుకు కోసం ప్రత్యేకమైన తాత్కాలిక పర్ణశాలను నిర్మించారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి శ్రీమధురకవి రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో సంప్రోక్షణ క్రతువు చేపట్టనున్నారు. మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంతోపాటు మార్చి 1నుంచి 11 వరకు జరిగే స్వామివారి 2025 వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ శుద్ధి చేపట్టారు. యాదగిరిగుట్ట పట్టణం, వంగపల్లి, రాయగిరి, భువనగిరితో పాటు ఉప్పల్ చౌరస్తా వరకు భారీ తోరణాలు ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేశారు. ఐదురోజులపాటు సాగే మహోత్సవాల్లో చివరి రోజు 23న ఉదయం 11.54 గంటలకు శ్రీసుదర్శన లక్ష్మీనారసింహ దివ్య విమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నారు.

సంత్ సేవాలాల్ జీవిత ఆశయాలను సాధించాలి

- కలెక్టర్ హనుమంతరావు

సంత్ సేవాలాల్ జయంతిలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 18 : సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత ఆశయాలను సాధిస్తూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదుగాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భువనగిరి పట్టణంలోని రావి భద్రారెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలు నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి కలెక్టర్, బంజారా ఉత్సవ కమిటీ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువకులు అన్ని రంగాల్లో ఎదుగాలంటే చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. సంత్ సేవాలాల్ బంజారా వారికే కాకుండా యావత్ జాతికి మార్గదర్శం అని అన్నారు. పేద స్థితి నుంచి ఉన్నత స్థాయికి రావాలంటే మార్చేది చదువు ఒక్కటే అని చెప్పారు. కార్యక్రమంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శోభారాణి, బంజారా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన

బొమ్మలరామారం కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి అంతర్గత మార్కులను మదింపు చేస్తున్న ఉపాధ్యాయల బృందం

బొమ్మలరామారం, ఫిబ్రవరి18 : మండలంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ, జిల్లా పరిషత్ మేడిపల్లి, నాగినేనిపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల రికార్డులను పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యా విషయాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులకు రికార్డుల నిర్వహణ, నమోదులో పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలన కమిటీ బృందం సభ్యులు శ్రీనివాస్, రవీందర్, దినేశ్, సీఆర్పీలు శ్రీహరి, విశ్వరూపం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి


సాంస్కృతిక కార్యక్రమాల్లో బంజారా విద్యార్థులు

బొమ్మలరామారం, ఫిబ్రవరి18 : మండల కేంద్రంలో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీకటిమామిడి హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని అన్నారు. భావితరాలకు బంజారా చరిత్రను తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు శ్రీహరి, అరుణ్, నరేశ్ నాయక్, సాగర్, రాజశేఖర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 18 : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులందరికీ రేషన్ కార్డులతోపాటు పెన్షన్ల అందించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారుడు బీవీ కోటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లిలో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల కోసం స్థలం కేటాయించి భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రిటైర్డ్ అయిన ప్రతి ఆర్టీసీ ఉద్యోగికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా సారబాలయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా మేకల మోహన్‌రెడ్డి, మన్నె రవీందర్‌రెడ్డి, కార్యదర్శిగా రామస్వామి బస్వారెడ్డి, చెరుకు చిన్నస్వామి, కోశాధికారిగా చెరుకు యాదయ్య, మునుకుంట్ల లక్ష్మీనారాయణ, సభ్యులుగా మైసగోని ఈశ్వరయ్య, కట్టె నర్సిరెడ్డి, ఎడమ గోవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సత్యం, రాష్ట్ర కోశాధికారి ఎస్‌కే యూసుఫ్, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ బీజేఎం రెడ్డి, ప్రొఫెసర్ కట్ట భగవత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి18 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డును ప్రకటించడాన్ని హర్షిస్తూ మంగళవారం ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామితోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగను కలిసి సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వర్గీకరణ ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మందకృష్ణ కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జాతీయ నాయకులు మందశంకర్, దానయ్య, దేవేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత తెలిపేలా.. ప్రచార ప్రయోగశాల

- ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

ఆత్మకూరు(ఎం) : ప్రయోగశాల బస్సులో సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి18 : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మాజీ రాష్ట్రపతి కలాం స్ఫూర్తి యాత్రపేరుతో సంచార ప్రయోగశాల బస్సు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోని ఒక పాఠశాలను ఎంచుకొని ప్రయోగశాల బస్సు ద్వారా విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని ఆత్మకూరు(ఎం)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంచుకున్నారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు సంచార ప్రయోగశాల బస్సులో ఏర్పాటు చేసిన సైన్స్ పరికరాలను తిలకించగా, ప్రయోగశాల నిర్వాహకులు మధు లాషబాబు 16 రకాల సైన్స్ పరికరాలను చూపిస్తూ అవగాహన కల్పించారు.

ఆసక్తి పెంపొందించేలా ఉంది

మాకు సంచార ప్రయోగశాల బస్సు ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి, అభిరుచి పెంచేలా ప్రయోగశాల ఉపయోగపడింది. జిల్లాలో మా పాఠశాలకే బస్సు రావడం అదృష్టంగా భావిస్తున్నాం. పుస్తకాల్లో చదివింది అంతంత మాత్రాన గుర్తుంటుంది. ప్రయోగ పూర్వకంగా కొన్ని అంశాలను నేర్చుకోవడంతో ఇవి జీవితాంతం గుర్తుంటాయి. ప్రయోగశాలలో చూపించిన సైన్స్ పరికరాలు ఆసక్తి కలిగించాయి.

-కొల శివకుమార్, పదో తరగతి, ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాల

శాస్త్ర విజ్ఞానంతోటే మానవాళి మనుగడ

సైన్స్ అండ్ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, విద్యపైన ఎక్కువ బడ్జెట్ కేటాయింపులు చేసిన దేశాలే అన్ని రంగాల్లో ముందుంటున్నాయి. మానవాళి మనుగడే ప్రశ్నార్థకమైనటువంటి కరోనా కాలంలో కూడా సైన్స్, టెక్నాలజీ కృషి ఫలితంగా లభించిన ఆవిష్కరణతో మెరుగైన వైద్య సేవలు అందించిన ఫలితంగానే మానవాళి బతికింది. మూఢ నమ్మకాల ఊబిలో కూరుకుపోతున్న ప్రస్తుత సమాజంలో శాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహన పెంచేందుకు పాఠశాలలో కలాం స్ఫూర్తి యాత్ర ద్వారా ప్రయోగశాల బస్సును ప్రవేశపెట్టి విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి.

-పెండెం నాగార్జున, విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, కొరటికల్

రాజాపేట తాసీల్దార్ బదిలీ

బదిలీ అయిన తాసీల్దార్ దామోదర్

రాజాపేట ఫిబ్రవరి 18: స్థానిక తాసీల్దార్ దామోదర్‌ను హైదరాబాద్ సీసీఎల్‌ఏకు బదిలీ చేస్తూ మంగళవారం జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి తాసీల్దార్‌గా డిప్యూటీ తాసీల్దార్ వెంకటేశ్వర్ రెడ్డికి బాధ్యతలను అప్పగించారు. ఇటీవల ఏసీబీ అధికారులమంటూ ఫోన్ చేసి సైబర్ నేరగాళ్లు లక్షలు బురిడీ కొట్టించారనే వచ్చిన వార్తలతో దామోదర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తున్నది.

గుర్తు తెలియని మహిళ మృతి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి18 : గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాతగుట్ట రోడ్డులో ఉన్న సాయిబాబా దేవస్థానం ముందు భాగంలో సుమారు 62 ఏండ్ల గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉందని డయల్ 100కు ఫోన్ వచ్చింది. విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ వీరగోపి ఘటనా స్థలికి చేరుకుని 108 అంబులెన్స్ సాయంతో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మహిళ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

శెట్టి శ్రీశైలం

బీబీనగర్, ఫిబ్రవరి 18 : కక్షతో ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మగ్దుంపల్లి గ్రామానికి చెందిన శెట్టి శ్రీశైలం (53) ఒక తనిపై వ్యక్తిగతంగా పగను పెంచుకుని హత్య చేసి చంపాడు. దీంతో భువనగిరి కోర్టులో న్యాయమూర్తి శెట్టి శ్రీశైలాన్ని దోషిగా తేల్చారు. రూ. 20 వేల జరిమానాతోపాటు జీవిత ఖైదు విధించారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి18 : మండలంలోని పల్లెర్ల, లింగరాజ్‌పల్లి, కూరెళ్ల, సిద్దాపురం గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుంచి 12గంటల వరకు విద్యుత్ సేవలను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్లకు సన్మానం

గొంగిడి మహేందర్‌రెడ్డి, ఇమ్మడి రామిరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ పీఏసీఎస్ డైరెక్టర్లు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి18: ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘం చైర్మన్లుగా ఐదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వంగపల్లి పీఏసీఎస్ చైర్మన్, మాజీ టెస్కాబ్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి, యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డిని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్లు కంబాల మల్లేశం, బత్తిని రామకృష్ణ, మేకల రాజు, ధీరావత్ రమేశ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. లక్ష్మీనరసింహ స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేండ్ల పదవీ కాలం విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతును రాజు చేసే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. 35 ఏండ్లుగా వంగపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగానని, గతంతో పోలిస్తే ఈ సారి రైతులకు అన్ని రకాల రుణాలు అందజేశామని చెప్పారు. రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు అరిగోస పడుతున్న పరిస్థితి కనిపిస్తున్నదని మండిపడ్డారు. కనీసం రైతుబంధుకు నోచుకోవడం లేదని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచులు కొండం అరుణ, ధీరావత్ బుజ్జి గుండ్ల సరితా మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ కాల్నె అయిలయ్య పాల్గొన్నారు.

పరీక్ష రాసిన పదిహేనేండ్లకు టీచర్ ఉద్యోగం

ఎన్జీటీగా విధుల్లో చేరిన రాంచందర్

రాజాపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని బేగంపేటకు చెందిన ఇండ్ల రాంచందర్ పరీక్ష రాసిన పదిహేనేండ్లకు టీచర్ ఉద్యోగం వరించింది. 2008లో విడుదల చేసిన డీఎస్సీలో పరీక్షలు రాయగా 2009లో ఎన్జీటీగా నియామకమయ్యాడు. అప్పట్లో బీఈడీ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా నియామక ప్రక్రియ నిలిచిపోయింది. బాధితులకు ఉద్యోగాలు కల్పించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో పదిహేనేండ్ల నిరీక్షణ తెరపడి ఉద్యోగం వచ్చింది. రాజాపేట మండలంలోని రఘునాథపురం ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఎన్జీటీగా మంగళవారం విధుల్లో చేరాడు. ఇతను 2011లో కండక్టర్‌గా ఉద్యోగం పొంది యాదగిరిగుట్ట డిపోలో ఇప్పటివరకు విధులు నిర్వహించాడు.

15 నిమిషాల్లోనే శాంపిల్స్ చేరవేత

- ఇంద్రియాల నుంచి డ్రోన్ సేవలు ప్రారంభం

ఇంద్రియాల నుంచి భువనగిరిలోని జిల్లా ఆసుపత్రికి తెమడ శాంపిల్స్ తీసుకెళ్తున్న డ్రోన్

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని ఇంద్రియాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. క్షయ నిర్మూలనలో భాగంగా సేకరించిన తెమడ శాంపిల్స్‌ను సోమవారం డ్రోన్ ద్వారా భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ ప్రాజెక్టులో భాగంగా డ్రోన్ సేవలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారిణి డాక్టర్ కపిల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా నాలుగు రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తెమడ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపుతున్నట్లు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, డ్రోన్ ద్వారా కేవలం 15 నిమిషాల్లోనే జిల్లా ఆస్పత్రికి శాంపిల్స్ చేరవేసినట్లు ఆమె చెప్పారు. త్వరలో అన్ని సెంటర్ల పరిధిలో డ్రోన్ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్య ఉప కేంద్రం ఆరోగ్య కార్యకర్తలు సునీత, టీబీ నోడల్ పర్సన్ ఎంఏ బిగ్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలి

సామాజిక పటం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 : రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని అనాజిపురం గ్రామంలో చేపట్టిన క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులు రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో మెళకువలు అనుసరించి సాగు విధానం చేపట్టి అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం గ్రామంలో సహజ వనరుల వినియోగం, పంటలు, వాటి పరిస్థితి, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను తెలియపరిచేలా విద్యార్థులు గ్రామ సామాజిక పటాన్ని రూపొందించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రసన్న, అభ్యుదయ రైతులు మల్లేశ్, చంద్రయ్య, భీమయ్య, రామచంద్రారెడ్డి, కంచి మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు టైరు కింద పడి వ్యక్తికి గాయాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి18 : ప్రమాదవశాత్తు ఆర్టీసీ టైరు కింద కాలు పడి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం రాజాపేట మండలంలోని నెమిలె గ్రామానికి చెందిన రాజయ్య భువనగిరికి వెళ్లేందుకు రాజాపేటలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగానే ఆ బస్సు దిగి భువనగిరికి వెళ్లేందుకు మరో బస్సు ఎక్కేందుకు ప్లాట్ ఫామ్‌పై వెళ్లగా అదే బస్సు టైరు కింద కాలు పడి నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ గమనించకపోవడంతోనే ఇది జరిగింది. స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది అతనిని 108 సహాయంతో భువనగిరి జిల్లా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తున్నది.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాయకులు

మాజీ సీఎం కేసీఆర్‌తో గుంటి కృష్ణ


కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు వల్లపు ప్రవీణ్‌యాదవ్

రాజాపేట/భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పలువురు జిల్లా వాసులు కలిశారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రసాదాన్ని అందజేశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మాజీ సర్పంచ్ గుంటి కృష్ణ, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకులు వల్లపు ప్రవీణ్‌యాదవ్, మట్ట ధనుంజయ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌తో బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు మట్ట ధనుంజయ్‌గౌడ్

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

చౌటుప్పల్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

చౌటుప్పల్, ఫిబ్రవరి 18 : చౌటుప్పల్ పట్టణంలోని బస్టాండ్ వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్లు జాతరకు వెళ్తుండగా ఆమె ఇక్కడ కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించారు. ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఆనంతరం ఆమె అక్కడి నుంచి అభివాదం చేసుకుంటూ వెళ్లారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా ఘన స్వాగతం పలికారు.

ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మోటకొండూర్ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మోటకొండూర్, ఫిబ్రవరి 18 : పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి చట్ట పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై విధులు చేపట్టాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, సిబ్బందితో కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. సైబర్ నేరాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని, పరిసరాలను ఆయన పరిశీలించారు. అక్కడి వాతావరణ పరిస్థితులను అధికారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీపీ రాజేశ్‌చంద్ర, డీసీపీ ఎస్ఓటీ రమణారెడ్డి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రమేశ్ కుమార్, సీఐ కొండల్‌రావు తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన చర్యలు

బీబీనగర్ : మండలంలోని పడమటి సోమారం గ్రామంలో గల ల్రింగ బసవేశ్వర స్వామి ఆలయాన్ని రాచకొండ సీపీ సుధీర్ బాబు మంగళవారం సందర్శించారు. ఆలయంలో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కట్టుదిట్టమైన బద్రతా చర్యలు చేపడతామన్నారు.

'పూర్తి స్థాయిలో రైతు భరోసా, రుణమాఫీ చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 18 : రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మాటల ప్రభుత్వంగానే ఉన్నదన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ ఇచ్చిన హామీ రెండు లక్షల రుణమాఫీ నేటికీ అమలు చేయలేదన్నారు. రైతు భరోసా ఎకరాకి సంవత్సరానికి రూ.15వేలు, ఆతర్వాత రూ.12వేలకు తగ్గించినా ఇంత వరకూ జమ కాలేదన్నారు. యాసంగి సీజన్ మధ్యలోకి వచ